క్లుప్తంగా

బాబు అరెస్ట్‌పై చర్చకు దమ్ములేదు

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: రాష్ట్రాన్ని నిలువుదోపిడీ చేసి 27 కేసుల్లో స్టేలు తెచ్చుకున్న చంద్రబాబు అరెస్టుపై చర్చించేందుకు దమ్ములేక టీడీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో పారిపోయారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ ఎద్దేవా చేశారు. శుక్రవారం అసెంబ్లీలో జరిగిన చర్చ సందర్భంగా టీడీపీ ఎమ్మెల్యేల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ బాబు అవినీతి బయట పడుతుండటంతో టీడీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. దేవాలయం లాంటి శాసనసభలో ప్రజా సమస్యలపై చర్చ కాకుండా టీడీపీ ఎమ్మెల్యేలు పిచ్చి పట్టిన కోతుల్లా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు.

ఈనెల 26 నుంచి పవిత్రోత్సవాలు

తాడేపల్లిరూరల్: సీతానగరంలోని దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఉపాలయమైన మద్వీరాంజనేయ సమేత కోదండరామస్వామి దేవాలయ పవిత్రోత్సవాలు ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కార్యనిర్వహణాధికారిని డి.భ్రమరాంబ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు స్వామి వార్ల దర్శనం మాత్రమే కల్పించనున్నట్లు చెప్పారు. ఆలయ అర్చకులు, స్వాముల సూచనల మేరకు పూజలు తాత్కాలికంగా నిలిపివేయబడతాయని వివరించారు. రాత్రి వేళలో నిద్ర చేయుటకు వచ్చు భక్తులకు ప్రవేశం నిలుపుదల చేసినట్లు చెప్పారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో మధుబాబు ప్రతిభ



మంగళగిరి: రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో కార్పొరేషన్ పరిధిలోని నవులూరుకు చెందిన ఎం.మధుబాబు ద్వితీయ స్థానం సాధించాడు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహిస్తున్న 36వ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్టేట్ లెవెల్ అథ్లెటిక్ మీట్ హర్డిల్స్ అండర్ -18 పురుషుల విభాగంలో 400 మీటర్లు హర్డిల్స్ పోటీల్లో మధుబాబు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో రాణించి ద్వితీయ స్థానం సాధించిన మధుబాబుకు విజేత స్పోర్ట్స్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు పీవీఎస్‌బీ సత్యనారాయణ, ఐ.వెంకట్రావు, కోచ్ కృష్ణ మోహన్ అభినందనలు తెలిపారు.

ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యం



మేడికొండూరు: ఆర్థిక అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధ్యమని లాంప్ సంస్థ డైరెక్టర్ కొండపల్లి సాల్మాన్‌పాల్ అన్నారు. మండలంలోని సిరిపురంలో ల్యాంప్ సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై రిజర్వుబ్యాంక్ ఆఫ్ఇండియా వారి సహకారంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సిరిపురం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ మధుసూదనరావు పాల్గొని మాట్లాడుతూ బ్యాంక్ ఖాతాలను ఎలా వినియోగించుకోవాలి, పొదుపు ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వరరావు, షేక్ బాజీ, మంగయ్య, పి.రాజు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెస్కే ప్రసాద్ రాక

మంగళగిరి: భారత మాజీ క్రికెటర్, బీసీసీఐ మాజీ చీఫ్ సెలెక్టర్ ఎంఎస్‌కే ప్రసాద్ శనివారం నగరానికి రానున్నారు. నగరంలోని కాజ వద్ద గల జెమ్స్ స్కూల్‌లో నిర్వహించే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మంగళగిరి/తాడేపల్లి రూరల్: కార్పొరేషన్ పరిధిలో కేఎల్‌యూ రోడ్డు విస్తరణ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈఈ అక్కల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు. నూతక్కి, చిర్రావూరు, పెదవడ్లపూడి, కొత్తపాలెం, వడ్డేశ్వరం, ఇప్పటం, మెల్లెంపూడి గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు. నివాస గృహాలతో పాటు వ్యవసాయ సరఫరాలో కూడా అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

దుగ్గిరాల మండలంలో..

దుగ్గిరాల మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా శనివారం నిలిపివేయనున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెదపాలెం సబ్‌స్టేషన్ పరిధిలోని రేవేంద్రపాడు, శృంగారపురం, తుమ్మపూడి, పెదపాలెం, పెరికలపూడి, చినపాలెం, వీర్లపాలెం, పెదకొండూరు మరియు గొడవర్రు గ్రామాలలో కోత ఉంటుందని చెప్పారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు

- ఇంటింటికి వైద్య బృందం సర్వే
- ప్రజలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రవణ్‌బాబు


దుగ్గిరాలలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న గుంటూరు డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రవణ్‌బాబు

తాడేపల్లిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి ఒక్కరికి ఎంతో మేలు అని, ఈ అవకాశాన్ని ప్రజలు సదివినియోగం చేసుకుని, వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకోవాలని గుంటూరు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.శ్రవణ్ బాబు కోరారు. దుగ్గిరాల మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారని దీనిలో భాగంగా ఈ నెల 30వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. ముందుగా ఆ యా ప్రభుత్వ వైద్యశాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఆశ వర్కర్లతో కలసి వైద్యులు ఇంటింటికి తిరిగి వారి ఇంట్లో ఆరోగ్య సమస్యలు ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని తెలుసుకుంటారని, వారికి ఏమైనా ఆరోగ్య సమస్యలు ఉన్నాయని తెలియజేస్తే వారికి సర్వేలో పాల్గొన్న సిబ్బంది ఒక టోకెన్ అందజేస్తారని చెప్పారు. ఆ ప్రాంతంలో ప్రభుత్వం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేస్తారని, ఆ మెడికల్ క్యాంప్‌లో జనరల్ చెకప్ చేసే డాక్టర్లతో పాటు స్పెషలిస్టులు కూడా ఉంటారని, వారికి అక్కడే 14 రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తారని పేర్కొన్నారు. ఎవరికైనా అక్కడ పరిష్కారం కాని జబ్బులకు ఆరోగ్యశ్రీ వర్తించే ఆస్పత్రికి పంపించి ఉచితంగా వైద్యం చేయిస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో దుగ్గిరాల మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ అబ్దుల్ రహమాన్, డాక్టర్ ఇందిర పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే

మంగళగిరి: నగరంలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే కొనసాగుతోంది. నగరంలో మొత్తం 47,960 నివాసాలుండగా 212 మంది వలంటీర్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, ఆరోగ్య శాఖ సిబ్బంది సర్వేలో పాల్గొని సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు 7,570 ఇళ్ల సర్వే నిర్వహించారు. 3,273 మందిలో వివిధ రోగాలను గుర్తించారు. ఏడు రకాల పరీక్షలు నిర్వహించి ఆయా రోగులకు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. నగరంలోని అన్ని సచివాలయాల పరిధిలో సర్వే కొనసాగుతుందని కార్పొరేషన్ కమిషనర్ యు.శారదాదేవి తెలిపారు.


నగరంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

సర్వే పరిశీలన..

మంగళగిరి: రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ ఆఫీసర్(డీపీఎంఓ) డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్ అన్నారు. శుక్రవారం ఆయన నగరంలోని ఇందిరా నగర్ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో నాలుగో సచివాలయం పరిధిలోని ఇందిరానగర్‌లో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేను పరిశీలించారు. సర్వే ఏవిధంగా జరుగుతుందనే విషయాలను హెల్త్ సెంటర్ మెడికల్ అధికారి డాక్టర్ పి.అనూషను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెల్త్ సెంటర్ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఆరోగ్య సమస్యలు ఉన్న వారు అక్టోబరు మూడవ తేదీన గణపతినగర్‌లోని యూపీహెచ్‌సీలో జరిగే ప్రత్యేక వైద్య శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకుని ఉచితంగా మందులు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ జయలక్ష్మి, ఏఎన్ఎం ఎం కవిత, ఆశలు శ్రావణి, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రావెలలో..

రావెల(తాడికొండ): రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని, ప్రతి వ్యక్తిని ఆరోగ్యంగా ఉంచేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రవేశ పెట్టిందని, తాడికొండ మండల ఎంపీడీఓ అత్తోట దీప్తి అన్నారు. శుక్రవారం తాడికొండ మండలం రావెల గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపెయిన్‌లో భాగంగా ఇంటింటికీ తిరిగి ఈ పథకం ద్వారా ప్రభుత్వం అందిస్తున్న సేవలను వివరించారు. ఈ సందర్భంగా సర్పంచి రావెల శైలజతో కలసి రావెల గ్రామంలో ఇంటింటికీ తిరిగి జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజలకు అవగాహన కల్పించారు.

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఆర్థిక సాయం అందించారు. దుగ్గిరాల ముర్తుజానగర్‌లో షేక్ జానీ రిజ్వానా దంపతులకు, ఎస్సీ కాలనీకి చెందిన వృద్ధురాలు చిక్కాల దయామనికి, దర్శికుమారికి, పెనుమూలికి చెందిన చిలకా సుశీలకు రూ.10వేల చొప్పున అందజేయించారు. కార్యక్రమంలో దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోష రూపవాణి, జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ, సర్పంచి బాణావత్ ఖుషీబాయి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ అధ్యక్షులు డి.వెంకటేశ్వరరావు, నాయకులు కంభంపాటి క్రాంతికుమార్, షేక్ జానీ బాషా, కనపర్తి సలోమి, గ్యాలం ఫణీంద్ర, నూతక్కి కోటేశ్వరరావు, రవి పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్కే సాయం

ఎంటీఎంసీ పరిధిలోని కొలనుకొండలోని ఇద్దరు చిరు వ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయంతో టిఫిన్ బండ్లను శుక్రవారం అందజేశారు. కొలనుకొండ ఎస్టీ కాలనీలో నివాసముంటున్న అజ్మీరా పార్వతి, గంగానమ్మపేటకు చెందిన కె.దేవిలకు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు నూతక్కి శ్రీనివాసరావు అందించారు.

మృతుడి కుటుంబానికి సాయం

అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబానికి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు గ్రామానికి చెందిన కొండూరు మోహనరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కుటుంబానికి ఎమ్మెల్యే అందించిన సాయాన్ని ఎంపీటీసీ సభ్యుడు కొండూరు సుమన్ శుక్రవారం అందజేశారు. కుటుంబ సభ్యులను పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ నాయకులు సుబ్బారావు, చంటి, అబ్రహాం, కిషోర్‌కుమార్, భాను ప్రసాద్ పాల్గొన్నారు.

గణేష్ నవరాత్రుల సందర్భంగా అన్నదానం


వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తాడేపల్లిరూరల్: గణేష్ నవరాత్రులలో భాగంగా ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి నేతాజీ సెంటర్‌లో శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి సీతానగరం జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు ముఖ్య అతిథిగా విచ్చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం కమిటీ సభ్యులు పురాణం వెంకటాచార్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఓలేటి రాము, పలగాని నాగబాబు, కాలూరి తిరుపతిరావు, రేఖా బాలాజీ, సూరగాని అనిల్‌కుమార్, గండికోట మురళీకృష్ణ, తల్లిబోయిన శ్రీను, విన్నప్రోలు నాగరాజు, షేక్ బాజీ, కర్పూరపు హనుమంతరావు, పాల్గొన్నారు.

నిడమర్రులో అన్నదానం

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని నిడమర్రు ఆంజనేయ స్వామి గుడి వద్ద ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, స్థానిక ఉత్సవ కమిటీ ప్రతినిధులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో మంగళగిరి పట్టణ వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఆకురాతి రాజేష్, తాడేపల్లి పట్టణ, రూరల్ కన్వీనర్లు బుర్రముక్కు వేణుగోపాలస్వామిరెడ్డి, మున్నంగి వివేకానందరెడ్డి పాల్గొన్నారు.

పోలీసు లాంఛనాలతో అనిల్ అంత్యక్రియలు


గౌరవ వందనం చేస్తున్న పోలీసు సిబ్బంది

ఫిరంగిపురం: గుంటూరులో ఎస్ఐ సెలక్షన్ విధులకు హాజరై తిరిగివస్తూ వేములూరిపాడు వద్ద లారీ ఢీకొనడంతో మృతి చెందిన ముప్పాళ్ల పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జి.అనిల్ అంత్యక్రియలు ఫిరంగిపురంలో క్రైస్తవ శ్మశాన వాటికలో శుక్రవారం సాయంత్రం పోలీసు లాంఛనాలతో నిర్వహించారు. అనిల్ స్వగ్రామం ఫిరంగిపురం కావడంతో మృతదేహాన్ని గ్రామంలో ఊరేగించి బాల ఏసుదేవాలయంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రైస్తవ శ్మశాన వాటికలో పోలీసు సిబ్బంది గౌరవ వందనం చేసి మూడు సార్లు గాలిలోకి కాల్చారు. కార్యక్రమంలో సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ, నరసరావుపేట -2 పట్టణ సీఐ వీరేంద్ర, పెదకూరపాడు సీఐ వీరాస్వామి, ముప్పాళ్ల ఎస్ఐ కిషోర్‌బాబు, ఏఎస్ఐలు మల్లికార్జునరావు, ఇమామ్ పాల్గొన్నారు.

తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్య

మంగళగిరి: తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కార్పొరేషన్ పరిధి నవులూరులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. నవులూరు ఎన్టీఆర్ కాలనీకి చెందిన గైరుబోయిన గురవయ్య- రమణమ్మ దంపతుల కుమార్తె గురులక్ష్మి(20) నగరంలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఇంట్లో పని చేయాలని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన గురులక్ష్మి తల్లి బయటకు వెళ్లగానే ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు సహాయంతో గురులక్ష్మి మృతదేహాన్ని కిందికి దించి పోలీసులకు సమాచారాన్ని అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

జగనన్న తోడు చిరు వ్యాపారులకు వరం


మాట్లాడుతున్న లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఆర్.మహీపాల్‌రెడ్డి

ఫిరంగిపురం: చిరు వ్యాపారులకు జగనన్న తోడు వరం అని లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ ఆర్.మహీపాల్ రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో యూనియన్ బ్యాంకు ఫిరంగిపురం ఆధ్వర్యంలో మూడు మండలాల స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులకు 7వ విడత పది వేల రుణ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు. అంతేకాక రైతులకు వ్యవసాయ రుణాలు, కౌలుదారుల కార్డులు, పశుదాణ కోసం రుణాలు వంటి అందిస్తున్నట్లు చెప్పారు. వీటితో పాటు అర్హులైనవారికి గృహాలకు రుణాలు, చదువుకునేందుకు రుణ సదుపాయం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. పీఎం జేజేబీవైకి ఏటా రూ.430 చెల్లిస్తే రెండు లక్షల బీమా వర్తిస్తుందని వివరించారు. పీఎం ఎస్‌బీవైకి ఏటా రూ.20 చెల్లించినట్లయితే దీనికి కూడా రెండు లక్షల బీమా వర్తిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జి.శరత్‌బాబు, డీడీఎం నాబార్డు జి.బ్రహ్మానందకుమార్(ఆర్ఎస్ఈటీఐ), బ్రాంచి మేనేజర్ ఈ.రాధిక పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు అఖిల్



తాడేపల్లిరూరల్: రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎస్.అఖిల్‌ఎంపికయ్యాడు. దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుతున్నాడు. విద్యార్థిని శుక్రవారం ఉపాధ్యాయులు అభినందించారు. హెచ్ఎం పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ చేబ్రోలు మండలం నారా కోడూరులో నిర్వహించిన జిల్లా జట్టు ఎంపికల్లో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈనెల 29 నుంచి అక్టోబర్ 1వ తేదీ వరకు తెనాలిలోని ఎస్ఎన్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొంటాడని తెలిపారు.

మెదడుపై పరిశోధనా కేంద్రం ఏర్పాటు కృషి

కేఎల్‌యూ చైర్మన్ కోనేరు సత్యనారాయణ

తాడేపల్లిరూరల్: న్యూరాలజిస్టులు 2050 నాటికి మెదడు రుగ్మతలను తగ్గించడంపై మార్గదర్శకాలను అందిస్తారని కేఎల్‌యూ చైర్మన్ కోనేరు సత్యనారాయణ అన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న కాలంలో మెదడుకు సంబంధించిన వ్యాధులపై మరింత లోతుగా అధ్యయనం చేయడం కోసం కేఎల్‌యూలో పరిశోధనా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పరిశోధనలకు తమ యూనివర్సిటీతో కలసి పనామా శాస్త్ర సాంకేతిక శాఖ వారు అల్జీమర్స్(మతిమరుపు)వ్యాధి ప్రస్తుతం ఏ దశలో ఉంది, అది భవిష్యత్‌లో ఏ స్థాయిలో ప్రజలపైన ప్రభావం చూపునుంది అనే అంశంపై పలురకాలు పరిశోధనలు జరుపనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఈ పరిశోధనలపై మతిమరుపు వ్యాధిపై ప్రపంచంలోని 30 మంది వైద్యులు, శాస్త్ర వేత్తలు కలసి జర్నల్ ఆఫ్ అల్జీమర్స్ డిసీజ్ అనే అంతర్జాతీయ పత్రికలో పలు రకాల పరిశోధనా పత్రాలు ప్రచురించాని వివరించారు. దీనికి జార్జి ఫెర్రి ముఖ్య సంపాదకులుగా వ్యవహరిస్తుండగా, కేఎల్‌యూ ప్రొ చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు ముఖ్య సంపాదకులుగాను, అమెరికా, ఆస్ట్రేలియా, చైనా, హాంకాంగ్, జపాన్ వంటి దేశాలకు చెందిన శాస్త్రవేత్తలు ఉప సంపాదకులుగా ఉన్నారని తెలిపారు. కేఎల్‌యు, అమెరికా, జపాన్, యూరప్, ఎయిమ్స్, బెంగళూరులోని నిమ్‌హాన్స్, విజయవాడలోని విమ్‌హాన్స్, గుంటూరులోని బృంద హాస్పిటల్, మణిపాల్ వంటి పలు రకాల ఆస్పత్రులలోని వైద్య నిపుణుల సహకారం తీసుకుని కేఎల్‌యూలో పరిశోధనా కేంద్రం మెదడుపైన వినూత్న పరిశోధనలకు శ్రీకారం చుడతామని వివరించారు.

కరెన్సీతో వినాయకుడికి అలంకరణ


నగరంలోని టిడ్కో ఇళ్ల వద్ద శుక్రవారం రాత్రి వినాయకుడిని రూ. 2.11 లక్షలతో అలంకరించారు. ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. -మంగళగిరి

పట్టణంలో పలువురికి అస్వస్థత

- తాగునీటి కలుషితంపై అనుమానాలు
- శాంపిల్స్ సేకరించిన అధికారులు

మంగళగిరి: పట్టణంలో పలువురు అస్వస్థతకు గురి కావడంతో చినకాకానిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అస్వస్థతకు తాగునీటి కలుషితమేనంటూ పలువురు అనుమానం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వెంటనే స్పందించిన అధికారులు పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో తాగునీటి శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను డీఎంహెచ్‌ఓ ఎ.శ్రావణ్‌బాబు, కమిషనర్ యు.శారదాదేవి, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతిరావు పరామర్శించారు. కమిషనర్ శారదాదేవి మాట్లాడుతూ పట్టణంలో సరఫరా అవుతున్న తాగునీరు కలుషితమైనట్లు స్థానిక ప్రజలు నుంచి వచ్చిన ఆరోపణల నేపథ్యంలో శాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపడం జరిగిందన్నారు. తాగునీటిని శుద్ధి చేసి సరఫరా చేయడం జరుగుతుందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

పాడి పెరుగుదలపై రైతులకు అవగాహన



కొల్లిపర(తెనాలి): పాడి పశువుల్లో పాల ఉత్పత్తి పెరుగులకు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు రైతులకు సూచనలు చేశారు. కొల్లిపర మండల గ్రామం వల్లభాపురంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం విస్తరణ సంచాలకుడు డాక్టర్ జి.వెంకటనాయుడు, సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ ఎం.గంగాదేవి, వెటర్నరీ సైంటిస్ట్ డాక్టర్ అర్చన, గృహ విజ్ఞాన శాస్త్రం నిపుణులు ఎం.దీపక్ పాల్గొన్నారు. పాడి పెరుగుదలతో పాటు అనుబంధంగా ఇంటి దగ్గర కోళ్లను పెంచాలని సూచించారు. మంచి పశువులకు 95 శాతం పెయ్య దూడలు మాత్రమే పుట్టేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు అజిటో బ్యాక్టీరియా, పాస్ఫో బాక్టీరియా, సుడోమోనాస్‌ను 100 కిలోల బాగా మాగిన పశువుల ఎరువులో కలిపి తయారు చేసుకుని, వరి, ఉద్యాన పంటల్లో వేయడం వల్ల ఎంతో ఉపయోగకరమని చెప్పారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాల్ని పొందవచ్చని తెలిపారు. ఈ బాక్టీరియా నేలకు కూడా చాలా ఉపయోగకరమైన సూక్ష్మజీవులుగా వివరించారు. కార్యక్రమంలో వల్లభాపురం గ్రామ సర్పంచ్ నిర్మల, ఉప సర్పంచ్ పోతిరెడ్డి, ప్రకృతి వ్యవసాయం వల్లభాపురం యూనిట్ మాస్టర్ ట్రైనర్ నాగకృష్ణ, మున్నంగి ఇన్‌చార్జి సుధారాణి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

యువతి ఆత్మహత్య

గుంటూరు ఈస్ట్: ఇంట్లో పని చేస్తున్న ఓ యువతి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ మూడో లైనులో భరత్‌కుమార్‌రెడ్డి నివాసం ఉంటున్నాడు. రెండు సంవత్సరాలుగా నెల్లూరుకు చెందిన పరిమళ (20) ఆయన ఇంట్లో పని చేస్తోంది. ఆమెకు తల్లిదండ్రులు ఇటీవల వివాహం చేసేందుకు సిద్ధమయ్యారు. ఇది ఇష్టంలేని పరిమళ మానసికంగా కృంగిపోయి గురువారం రాత్రి గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తిపై దాడి

గణేష్ నిమజ్జనంలో జరిగిన వివాదం నేపథ్యంలో ముగ్గురు వ్యక్తులు కలసి మరో వ్యక్తిపై దాడి చేసిన ఘటనపై కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు. గణేష్ వారి వీధికి చెందిన దాసరి విష్ణు వినాయక విగ్రహ నిమజ్జనం సమయంలో కొందరు మద్యం తాగి గొడవ చేస్తుంటే వారించాడు. నిమజ్జనం అనంతరం రజాక్, ప్రశాంత్, సాయి కలసి విష్ణుపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అన్నమయ్య కీర్తనల గాయకులకు ఆహ్వానం

తెనాలి: పట్టణానికి చెందిన సాంస్కృతిక సంస్థ సంకీర్తన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'అన్నమయ్య కీర్తనల ఆలాపన'కు శాస్త్రీయ సంగీతంలో ప్రవేశమున్న 30 ఏళ్లలోపు యువతీయువకులను ఆహ్వానిస్తున్నట్టు అధ్యక్షుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆసక్తి గలవారు అన్నమయ్య కీర్తనలు రెండు (పల్లవి, ఒక చరణం) పాడి 9849131035కు వాట్సాప్‌లో పంపించాలని కోరారు. వీరితో ఆడిషను నిర్వహించి, వారి గాత్ర ధర్మం ప్రకారం కీర్తనలు కేటాయించి తగిన శిక్షణనిస్తామని తెలిపారు.

అనంతరం వాద్య సహకారంతో రిహార్సల్స్ చేయించి, డిసెంబరు 17వ తేదీన తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో నిర్వహించే గానాలాపనలో గాయనీగాయకులుగా పరిచయం చేస్తామని వివరించారు.